


EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com


4 PM

www.suryaa.com

బుధవారం

26 జూన్ 2024


పేజీలు: 02

## సెమీ ఫైనల్-1

సౌతాఫ్రికా vs ఆఫ్ఘానిస్తాన్

రేపు 6.30 ఉదయం



## సెమీ ఫైనల్-2

ఇండియా vs ఇంగ్లండ్

రేపు 10.30 రాత్రి



## జులై మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణ?

జులై మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణ ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేని హైదరాబాద్, రంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి ఒక్కొక్కరిని కేబినెట్‌లోకి తీసుకోనున్నట్లు సమాచారం. సుదర్శన్ రెడ్డి, మదన్‌మోహన్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావు, వివేక్ వెంకటస్వామి, వినోద్, రామ్మోహన్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, దానం నాగేందర్ మంత్రి పదవుల రేసులో ఉన్నట్లు టాక్.







# రెండోసారి స్పీకర్‌గా ఓం బిర్లా

## లోక్ సభలో మోడీకి రాహుల్ షేక్ హ్యాండ్

18వ లోక్‌సభ స్పీకర్‌గా భాజపా ఎంపీ ఓం బిర్లా ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవి చేపట్టడం వరుసగా ఇది రెండోసారి కావడం విశేషం. బుధవారం జరిగిన ఎన్నిక ప్రక్రియలో ఇండియా కూటమి అభ్యర్థిపై ఆయన విజయం సాధించారు. స్పీకర్ పదవికి ఎన్నిక జరగడం 48ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం గమనార్హం. సభాపతి పదవిపై అధికార, విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. బుధవారం లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. సభాపతిగా ఓం బిర్లా పేరును ప్రతిపాదిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని రాజ్‌నాథ్ సింగ్‌తో పలువురు ఎన్డీయే ఎంపీలు బలపరిచారు. అటు ఇండియా కూటమి తరఫున కె.సురేశ్ పేరును శివసేన (యూబీటీ) ఎంపీ అరవింద్ సావంత్ తీర్మానం తీసుకొచ్చారు. దీన్ని పలువురు విపక్ష ఎంపీలు బలపర్చారు. అనంతరం మూజువాణీ విధానంలో ఓటింగ్ చేపట్టారు. ఇందులో ఓం బిర్లా విజేతగా నిలిచినట్లు ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రకటించారు. అనంతరం ప్రధాని మోదీ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వెంట రాగా.. ఓం బిర్లా సభాపతి పీఠంపై ఆసీనులయ్యారు. ఆయనకు మోదీ, రాహుల్ సహా లోక్‌సభ సభ్యులు అభినందనలు తెలియజేశారు. స్పీకర్ పదవిని వరుసగా రెండుసార్లు చేపట్టిన ఐదో వ్యక్తి ఓం బిర్లా. ఆయనకంటే ముందు ఎం.ఎ.అయ్యంగార్, జి.ఎస్.ధిల్లాన్, బలరాం ఝాఖడ్, జి.ఎం.సి. బాలయోగి వరసగా రెండు విడతలు ఈ పదవికి ఎన్నికయ్యారు. వీరిలో బలరాం ఝాఖడ్ ఒక్కరే పదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేశారు. 61 ఏళ్ల ఓం బిర్లా రాజస్థాన్‌లోని కోటా నుంచి మూడోసార్లు ఎంపీగా గెలిచారు. 2014లో ఎన్నికైన ఆయన లోక్‌సభలో 86శాతం హాజరును నమోదు చేసుకున్నారు. 671 ప్రశ్నలడిగారు. 2019లో గెలిచాక అనూహ్యంగా స్పీకర్ అయ్యారు.

## భారత్ సెమీస్‌కు రిజర్వ్ డే లేదు..

టీ20 వరల్డ్ కప్ సెమీస్‌లో సౌతాఫ్రికా – ఆఫ్ఘానిస్తాన్మ్యాచ్‌కి రిజర్వ్‌డే ఉండగా ఇండియా – ఇంగ్లండ్ మ్యాచ్‌కి లేదు. ఇందుకు కారణం సమయమే. ఇండియా – ఇంగ్లండ్ మ్యాచ్ విండీస్ టైమ్ ప్రకారం జూన్ 27 ఉ.10.30గంటలకు మొదలవుతుంది. మన టైమ్ ప్రకారం జూన్ 27 రాత్రి 8గంటలకు. ఫైనల్స్ జూన్ 29 ఉ.10.30కి(విండీస్) మొదలవుతుంది. అంటే రెండో సెమీస్‌కు రిజర్వ్‌డే కేటాయిస్తే ఫైనల్స్‌కి 24 గంటల సమయం కూడా ఉండదు. అందుకే రిజర్వ్ డే లేకుండా 250 ని.ల అదనపు టైం కేటాయించారు.



## జీవన్‌రెడ్డికి సోనియా గాంధీ ఫోన్

కాంగ్రెస్ ఎంఎల్‌సీ జీవన్‌రెడ్డి ఢిల్లీకి రావాలని సోనియా గాంధీ ఫోన్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌ను పార్టీలో చేర్చుకోవడంతో అలకబూనిన జీవన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా నిన్న మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను బుజ్జగించారు. ఈరోజు భట్టి ఢిల్లీకి వెళ్లిన కాసేపటికే అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది.



## ఓపెనర్‌గా కోహ్లీ ఫెయిల్!

టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ కోహ్లీ తీవ్రంగా నిరాశపరుస్తున్నారు. విరాట్‌కి ఓపెనింగ్ కలిసి రావడం లేదనేది అభిమానుల వాదన. ఐపీఎల్‌లో ఓపెనర్‌గా రాణించారని, మెగా టోర్నీలో మాత్రం తేలిపోతున్నారని కొందరు అంటున్నారు. ఈ టోర్నీలో విరాట్ 2సార్లు డకౌట్, 2 సార్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. మొత్తం 6 మ్యాచులు ఆడి 66 రన్సే చేశారు. సెమీస్, ఫైనల్‌లో అయినా కోహ్లీ వన్ డౌన్‌లో ఆడాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

### మేడిగడ్డ బ్యారేజీతో రాష్ట్రానికి రూ. 800 కోట్ల పైన లాభం

## అర్జించనున్న కాంగ్రెస్ ప్రభుత్వం



మేడిగడ్డలో ఇసుక అమ్మకం ద్వారా భారీగా ఆదాయం. కాళేశ్వరం ప్రాజెక్ట్ మేడిగడ్డ వల్ల రాష్ట్రానికి నష్టం జరిగింది అన్న ప్రభుత్వానికి ఇప్పడు కాసుల వర్షం కురవబోతుంది. 200, 300 కోట్లు పెట్టి పిల్లర్లు రిపేర్ చేయించలేని రాష్ట్ర ప్రభుత్వం అక్కడున్న ఇసుక అమ్మి కోట్ల రూపాయల ఆదాయం పొందబోతుంది. బ్యారేజి పిల్లర్లు కుంగిన తర్వాత నీటిని కిందకు వదలడంతో భారీగా ఇసుక మేటలు బయటపడ్డాయి.. వీటిని తవ్వి ఇసుకని విక్రయించడం ద్వారా రాష్ట్రానికి రూ. 800 కోట్లు పైన ఆదాయం రానుంది. ముందుగా 14 బ్లాకులను వేలం వేయాలని నిర్ణయించుకున్న ప్రభుత్వం.. వేలం వేసే భాధ్యతను రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థకు అప్పగించింది. జూలై మొదటి వారంలో వేలం ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించుకుంది.. త్వరలోనే మరిన్ని బ్లాకులనుండి ఇసుకను వెలికి తీయాలని భావిస్తుంది. మరో వైపు మేడిగడ్డ బ్యారేజికి ఎగువన ఉన్న అన్నారం, సుందిళ్ల బ్యారేజిలోను ఇసుక లభ్యతపై జిల్లా స్థాయి ఇసుక కమిటీలు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఇసుక వెలికితీతకు ఎలాంటి ఆటంకాలు లేకుంటే ఖజానాకు కాసుల వర్షం కురుస్తుందని టీజీఎండీసీ లెక్కలు వేస్తుంది.

### 29న కొండగట్టుకు

## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణ పర్యటన ఫిక్సయ్యింది. ఈ నెల 29న ఆయన కొండగట్టుకు రానున్నారు. శనివారం నాడు ఉదయం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ వారాహి అమ్మవారి దీక్షలో ఉన్నారు. 11 రోజుల పాటు కొనసాగనున్న ఈ దీక్షలో భాగంగా ఆయన కేవలం పండ్లు, ద్రవాహారం మాత్రమే తీసుకోనున్నారు. వారాహి దీక్షలో భాగంగానే పవన్ కల్యాణ్ తమ ఇలవేల్పు అయిన ఆంజనేయ స్వామిని దర్శించుకోనున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం హోదాలో ఆయన కొండగట్టుకు రావడం ఇదే తొలిసారి. గతంలో ఏపీ ఎన్నికల ప్రచారానికి ముందు కూడా కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి వచ్చారు. తన ఎన్నికల ప్రచార రథమైన వారాహికి ఇక్కడే పూజలు చేయించారు. అనంతరం తన వారాహి విజయ యాత్రను కొనసాగించారు. ఇటీవల జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయ దుంధుబి మోగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంలో కీలక పాత్ర పోషించారు.



## ప్రతిపక్ష హోదాపై స్పీకర్‌కు వైఎస్ జగన్ లేఖ..

### విరుచుకుపడ్డ ఏపీ మంత్రులు

అసెంబ్లీ విధానాన్ని తప్పబడుతూ ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడికి వైసీపీ అధినేత జగన్ లేఖ రాయడంపై ఏపీ మంత్రులు విరుచుపడ్డారు. గత ఐదేళ్లు ప్యాలెస్‌లో కాకుండా ప్రజలతో ఉండి ఉంటే ఇప్పడు స్పీకర్‌కు లేఖ రాసే పరిస్థితి వచ్చేది కాదని ఎద్దేవా చేశారు. వైసీపీని జగన్ ఘోరంగా ఓడించినా.. చంద్రబాబు పెద్ద మనసుతో అసెంబ్లీలో గౌరవం కల్పించారని తెలిపారు. అందుకే అర్హత లేకపోయినా సాధారణ ఎమ్మెల్యే అయినప్పటికీ ఆయన వాహనాన్ని అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతించారని తెలిపారు.స్పీకర్‌కు జగన్ లేఖ రాయడం విడ్డూరంగా ఉందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. అర్హత లేకపోయినా సాధారణ ఎమ్మెల్యే అయినా సరే జగన్ రెడ్డి వాహనాన్ని అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతి ఇచ్చారని తెలిపారు. అక్షర క్రమంలో ప్రమాణస్వీకారం చేయాల్సిన వైఎస్ జగన్‌ను వైసీపీ నేతల అభ్యర్థన మేరకు ముందే ప్రమాణం చేయించారని మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. ప్రజలను అతనికి ప్రతిపక్ష స్థానం కూడా ఇవ్వకపోయినా కూడా టీడీపీ మీద పడి ఏడవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.



## జూడాల సమ్మెకు తాత్కాలిక బ్రేక్

సమ్మెను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జూనియర్ డాక్టర్లు (జూడా) ప్రకటించారు. డీఎంఈ, ఆరోగ్య శాఖ అధికారులతో మంగళవారం అర్ధరాత్రి వరకు వారు చర్చలు జరిపారు. ఈక్రమంలో గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో జూడాల వసతి భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. కాకతీయ వర్సిటీలో రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని తెలిపింది. బుధవారం ఇందుకు సంబంధించి రెండు జీవోలు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. జీవోలు విడుదల కాకపోతే మళ్లీ సమ్మె కొనసాగిస్తామని జూడాలు స్పష్టం చేశారు. గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెలా స్టైపెండ్ చెల్లింపు సహా ఎనిమిది ప్రధాన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జూనియర్ డాక్టర్లు ఇటీవల సమ్మెకు దిగిన విషయం తెలిసిందే.

### ఢిల్లీ మద్యం కుంభకోణం..

## సీబీఐ కస్టడీలోకి సీఎం కేజ్రీవాల్



ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసేందుకు కేంద్ర దర్యాప్తు బృందానికి కోర్టు బుధవారం అనుమతించింది. దీనిపై న్యాయమూర్తి అమితాబ్ రావత్ ఆదేశాలు జారీ చేసిన వెంటనే సీబీఐ అధికారులు ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. తిహార్ కేంద్ర కారాగారం నుంచి కేజ్రీవాల్‌ను ఉదయం కోర్టు ముందు హాజరుపర్చారు. ఆయనను కస్టడీకి కోరుతూ సీబీఐ కోర్టుకు దరఖాస్తు చేసుకుంది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఇప్పటికే ఆయన్ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.



## దారుణం.. కల్తీ మద్యం ఘటనలో 61కి పెరిగిన మృతుల సంఖ్య..

### వివరణ కోరిన ఎన్‌హెచ్ఆర్‌సీ

తమిళనాడులోని కళ్లకురిచ్చి ప్రాంతంలో కల్తీ మద్యం తాగి మృతి చెందిన వారి సంఖ్య 61కి చేరింది. జూన్ 18న కరుణాపురం గ్రామంలో కల్తీ మద్యం తాగిన వారిలో 118 మంది వరకు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. కాగా, ఈ దారుణ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్పందించింది. తమిళనాడు చీఫ్ సెక్రటరీ, రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్‌కు ఎన్‌హెచ్ఆర్‌సీ నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై వివరణాత్మక నివేదిక కోరింది. మరోవైపు ఈ కల్తీ సారా ఘటనలో ఆరుగురు మహిళలు కూడా మరణించడంపై జాతీయ మహిళా కమిషన్ స్పందించింది. ఈ ఘటనను సుమోటోగా తీసుకుని విచారణకు ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలోని సభ్యురాలైన ఖుష్బు సుందర్ ఇవాళ బాధిత కుటుంబాలతోపాటు చికిత్స పొందుతున్న వారిని కూడా పరామర్శించనున్నారు. ఇదిలా ఉంటే, కల్తీ మందు విషాదంపై రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఏఐఏడీఎంకే, బీజేపీ ఈ ఘటనపై డీఎంకే సర్కార్ లక్ష్యంగా విమర్శలు గుప్పిస్తున్నాయి. కళ్లకురిచి ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం ఎంకే స్టాలిన్ రాజీనామా చేయాలని ఏఐఏడీఎంకే నిరసనలు చేపట్టింది.



## స్పీకర్ ఎమర్జెన్సీ వ్యాఖ్యలతో లోక్‌సభలో దుమారం

స్పీకర్ ఎన్నిక జరిగిన కాసేపటికే లోక్‌సభలో ఇవాళ గందరగోళం నెలకొంది. స్పీకర్‌గా తిరిగి ఎన్నికైన ఓం బిర్లా సభలో ఎమర్జెన్సీ వ్యాఖ్యలు చేశారు. దీంతో ఒక్కసారిగా సభలో దుమారం రేగింది. బుధవారం ఉదయం మూజువాణీ ఓటింగ్ ద్వారా ఇండియా కూటమి అభ్యర్థి సురేష్‌పై ఎన్డీయే అభ్యర్థి ఓం బిర్లా గెలిచి.. స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అనంతరం ఆయనకు అధికార, విపక్ష కూటమి నేతలు శుభాకాంక్షలు తెలిపారు. 18వ లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా తొలి ప్రసంగం చేస్తూ.. ఎమర్జెన్సీ పాలనను ప్రస్తావించారు. ఎమర్జెన్సీ పాలన చీకటి రోజులని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అదే సమయంలో అధికార పక్ష సభ్యులు సైతం పోటీగా నినాదాలు చేశారు. దీంతో లోక్‌సభ ఒక్కసారిగా హోరెత్తిపోయింది. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను రేపటికి వాయిదా వేశారు. తిరిగి రేపు( జూన్ 27) ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. రేపు రాష్ట్రపతి ప్రసంగంతో పార్లమెంట్ సమావేశాలు ముగుస్తాయి.



## బేగంపేటలో కత్తులతో దాడి చేసి యువకుడి దారుణ హత్య!

హైదరాబాద్‌లో రోజురోజుకీ హత్యలు పెరిగిపోతున్నాయి. పాటిగడ్డ ప్రాంతానికి ఉస్మాన్ అనే యువకుడు ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఈ వ్యవహారం యువతి బావ అజాజ్‌కు నచ్చలేదు. దాంతో అతను తన ముగ్గురు స్నేహితులతో కలిసి ఉస్మాన్ హత్యకు ప్లాన్ వేశాడు. నలుగురూ మాటువేసి ఉస్మాన్‌ను కత్తులతో పొడిచిచంపారు. దాంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. హత్య అనంతరం అజాజ్ తన స్నేహితులతో కలిసి పోలీస్ స్టేషన్లో లొంగి పోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురు యువకులను విచారిస్తున్నారు.



భర్తతో దూరంగా ఎందుకు ఉంటున్నావ్..

## నాతో కోపరేట్ చేస్తే కేసు పరిష్కరిస్తా

కాళేశ్వరం ఎస్ఐ భవానీ సేన్ ఉదంతం మరిచిపోకముందే మరో దారుణం ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలి.. నాకోసం చేపల కూర, చికెన్ కూర వండుకుని రావాలి.. గ్రీన్ టీ చేసి పెట్టాలి. భూ వివాదంలో న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన మహిళను లైంగిక వేదింపులతో వేధించిన ఎస్ఐ. నల్లగొండ - శాలిగౌరారం మండలానికి చెందిన ఓ మహిళ భూమి విషయంలో జరిగిన ఘర్షణపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే శాలిగౌరారం ఎస్ఐ వాస ప్రవీణ్ కుమార్ ఆమెను స్టేషన్‌కు పిలిపించారు. రెండు గంటలపాటు అతని చాంబర్లో ఉంచి, అభ్యంతరకరంగా మాట్లాడడంతోపాటు వేధింపులకు గురిచేశాడు. ఈ కేసును పరిష్కరించాలంటే నేను చెప్పినట్లు చేయాలి. ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలి. చేపల కూర, చికెన్ వండుకుని తేవాలి. నాకు కావల్సినప్పుడల్లా గ్రీన్ టీ చేసి పెట్టాలి. భర్తకు దూరంగా ఎందుకు ఉంటున్నావ్? అతనితో ఉండాలన్న కోరిక లేదా?' అని ప్రశ్నించాడని బాధిత మహిళ వాపోయారు. తనతో మంచిగా ఉంటే పూర్తి సహకారం ఉంటుందని ఎస్ఐ చెప్పినట్లు ఎస్పీ ఎదుట సదరు మహిళ బోరున విలపించారు. అతను చెప్పినట్లు చేయకపోవడంతో తన కుటుంబ విషయాల్లో జోక్యం చేసుకొని, గొడవలు సృష్టించినట్లు ఫిర్యాదులో తెలిపారు.

## రకుల్ హాట్ లుక్స్


ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఒక వెలుగు వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్ గ్రాఫ్ ప్రస్తుతం పూర్తిగా పడిపోయింది. ఇక రీసెంట్‌గా పెళ్లి కూడా చేసుకోవడంతో కెరీర్‌కి ఎక్కడ ఫుల్ స్టాప్ పెట్టేస్తుందోననిరెడ్ హాట్ మిర్చిలా రకుల్ ప్రీత్.. పెళ్లయ్యాక ఘాటు పెంచిందే గత నెలలోనే తన ప్రియుడు జాకీ భగ్నానీని పెళ్లి చేసుకుంది రకుల్ ప్రీత్ సింగ్. పెళ్లయి నెల రోజులు కూడా కాకుండానే తన కెరీర్‌పై కాన్సన్‌ట్రేషన్ చేస్తుంది రకుల్. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫొటోలు చూసి నెటిజన్లు అవాక్కవుతున్నారు. రెడ్ హాట్ మిర్చిలా రకుల్ కనిపించేసరికి ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. వీటిపై మీరూ ఓ లుక్కేయండి.రెడ్ హాట్ మిర్చిలా రకుల్ ప్రీత్.. పెళ్లయ్యాక ఘాటు పెంచెసింది.



## అన్నాడీఎంకే ఎమ్మెల్యేలపై అసెంబ్లీలో సస్పెన్షన్



అన్నాడీఎంకే ఎమ్మెల్యేలపై వేటు పడింది. అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ విధించారు. ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామితో పాటు ఇతర అన్నాడీఎంకే ఎమ్మెల్యేలపై ఇవాళ ఉదయం వేటు వేశారు. అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటున్న అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను సభా నుంచి పంపించివేయాలంటూ తమిళనాడు స్పీకర్ ఎం అప్పవు ఆదేశించారు. దీంతో రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానాన్ని పాస్ చేశారు. అసెంబ్లీ సెషన్ పూర్తి అయ్యే వరకు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారు. ప్రశ్నోత్తరాలను వాయిదా వేసి కల్లకురిచిలో కల్తీ మద్యం తాగి మరణాలు నమోదు అయిన ఘటనపై చర్చ చేపట్టాలని అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ రాజీనామా చేయాలని అన్నాడీఎంకే డిమాండ్ చేసింది. అసెంబ్లీ సమావేశాల నుంచి అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారు. సెషన్ మొత్తం ఆ సస్పెన్షన్ కొనసాగనున్నది. ప్రశ్నోత్తరాలను రద్దు చేసి, కల్లకురిచిలో జరిగిన కల్తీ సారా మరణాలపై చర్చ చేపట్టాలని అన్నాడీఎంకే ఎమ్మెల్యేలుడిమాండ్ చేశారు.




## హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో బెడ్ షీట్స్ లేవు.. చేర్చుకోవడం కుదరదు

### ఐపీ సేవలు నిలిపివేసిన ఆసుపత్రి సిబ్బంది

హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో బెడ్ షీట్స్ లేవు అని ఐపీ సేవలు నిలిపివేసిన ఆసుపత్రి సిబ్బంది. జిల్లాల నుండి చికిత్స నిమిత్తం నిమ్స్ ఆసుపత్రికి వచ్చి ఇబ్బందులకు గురవుతున్న రోగులు. ఐపీ సేవలు నిలిపివేయడంతో ఆపరేషన్లు, సర్జరీల కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులను బెడ్ షీట్లు లేవు అనే సాకుతో సిబ్బంది అడ్మిట్ చేసుకోకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేక దిక్కుతోచని పరిస్థితిలో రోగులు సతమతమవుతున్నారు..



## పెంపుడు కుక్క కాటు.. తండ్రీకొడుకు మృతి

పెంపుడు కుక్క కరవడంతో తండ్రీకుమారుడు మృతి చెందిన ఘటన విశాఖ జిల్లా భీమిలిలో జరిగింది. నరసింగరావు (59), ఆయన కుమారుడు భార్గవ్ (27) ను వారం క్రితం వారి పెంపుడు కుక్క కరిచింది. భార్గవ్‌ను ముక్కు మీద, నరసింగరావును కాలిపై కరిచింది. ఈ ఘటన జరిగిన 2 రోజులకు కుక్క చనిపోవడంతో వారు అప్రమత్తమై యాంటీ రేబిస్ ఇంజక్షన్ తీసుకున్నారు.